సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



సంఘమిత్ర...సేవా తృష్ణ

సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. 8లో



అనంతుని దీపోత్సవం

కార్తీక మాసం ఆఖరు రోజున అమావాస్య చీకట్లను పారదోలుతూ అనంత పద్మనాభుడి గిరిపై దీపోత్సవం జరగనుంది. 8లో



ఆకట్టుకున్న 'కన్యాశుల్కం'

సీతంపేట: గురజాడ వర్ధంతి సందర్భంగా విశాఖ పౌరగ్రంథాలయంలో కన్యాశుల్కం సంక్షిప్త నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

గోప్యతలో మతలబేంటి?



ఆస్పత్రిలో క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

రాగూర్ ఫార్మా ప్రమాద ఘటనలో రెండుకు పెరిగిన మరణాలు

వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 27 మంది కార్మికులు

ఎన్టీఆర్ ఆస్పత్రిలో 34 మంది కార్మికులకు స్క్రీనింగ్

వివరాలు వెల్లడించని అధికారులు, యాజమాన్యం

సాక్షి, అనకాపల్లి: పరవాడ జేఎన్ ఫార్మాసిటీలో రాగూర్ ఫార్మా కంపెనీ యూనిట్–3లో విషవాయువు లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన వారి వివరాలు వెల్లడించడంలో కంపెనీ యాజమాన్యం, అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఇందులో మతలబుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఈ ఘటనలో అస్వస్థతకు గురై కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందగా.. వేర్వేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 27కి చేరింది. ప్రస్తుతం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో 17 మంది కార్మికులు, మెడికవర్ ఆస్పత్రిలో 8 మంది కార్మికులు, మామ్స్ (అగనంపూడి) ఆస్పత్రిలో ఒకరు, కేర్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు.

ఫార్మా ఘటనలో ఆగిన మరో ఊపిరి

అక్కిరెడ్డిపాలెం: పరవాడలోని జవహర్‌లాల్ ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మా కంపెనీలో విషవాయువు లీకైన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురైన ముగ్గురు కార్మికులను షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన అమిత్ బాగ్ (23) చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కంపెనీలో జూనియర్ మేనేజర్ (వేర్ హౌస్)గా పనిచేస్తున్న వీరశేఖర్ (34) గురువారం వేకువజామున మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కెమిస్ట్‌గా పనిచేస్తున్న అగనంపూడికి చెందిన చిన్ని కృష్ణ (44)కు ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరశేఖర్ మృతితో అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ అధికారులు, పోలీస్ సిబ్బంది, పరవాడ రెవెన్యూ అధికారులు షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు.



రాగూర్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన ప్రదేశం ఇదే..

షిఫ్ట్‌లో 90మంది కార్మికులు

కంపెనీలో మొత్తం 236 మంది కార్మికులు, ఉద్యోగులు ఉండగా.. ప్రమాదం జరిగినప్పుడు షిఫ్ట్‌లో 90 మంది విధుల్లో ఉన్నారు. వీరిలో ఇద్దరు మృతి చెందగా మరో 27 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 34 మందికి ఎన్టీఆర్ ఆస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.

ఫార్మా ప్రమాద బాధితులకు కలెక్టర్ పరామర్శ

రాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురై షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పరామర్శించారు. గురువారం రాత్రి ఆయన ఆస్పత్రికి చేరుకొని క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబాలతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

మృతులకు కోటి పరిహారం చెల్లించాలి

అనకాపల్లి: పరవాడ ఫార్మా సిటీలోని రాగూర్ కంపెనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీపీఎం, సీఐటీయూ జిల్లా నాయకులు గురువారం పరామర్శించారు. ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, ప్రమాదం జరిగిన తర్వాత కూడా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగి విషవాయువులు పీల్చిన 29 మంది ఆస్పత్రి పాలయ్యారని, అందులో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. సిటు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చనిపోయినవారు

అమిత్ బాగ్(23)

వీరా శేఖర్(34)

చికిత్స పొందుతున్నవారు

కిమ్స్ ఐకాన్‌లో

1) డి.చిన్ని కృష్ణ
2) గోపి రాజాశేఖర్ రెడ్డి
3) ముందూరు భాస్కర్ ప్రదీప్
4) కె.సంజీవ్
5) డి.రూన్సీ రాణి
6) కె.వెంకటరమణ
7) కె.పూర్ణ భవాని
8) సట్టూరు త్రినాథరావు

మెడికవర్ ఆస్పత్రిలో

1) నల్ల భాస్కర్‌రావు
2) ధనమిశెట్టి పాపారావు
3) గుర్రం శరత్‌కుమార్
4) అల్లటిపల్లి అనిల్
5) బుగత వీరబాబు
6) చెంపన రాజారావు
7) ఎం. శివకుమార్
8) జి.వాసు
9) చందన్ పటేల్
10) శ్రీనివాసరావు తోట
11) ఎం.రమేష్
12) బి.చిత్రదాస్
13) జి.మురళి
14) చప్పా ధనుంజయ్‌రావు
15) గొర్లె భానుప్రకాష్
16) మంగవరపు బాలాజీ
17) మాటా రెడ్డి

అగనంపూడి మామ్స్ ఆస్పత్రిలో

శ్రీకాంత్

కేర్ ఆస్పత్రిలో: పిచ్చయ్య చౌదరి

మనోళ్లకే ఎన్‌వోసీ..



- రెవెన్యూ అధికారులకు కూటమి పెద్దల నుంచి తీవ్ర ఒత్తిడి
- జిల్లాలో 6 ఇసుక డిపోలకు ప్రైవేట్ టెండర్లు
- నక్కపల్లి, అనకాపల్లి, అచ్యుతాపురం, నర్సీపట్నం డిపోలపై కూటమి నేతల కన్ను
- నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అనకాపల్లి: వ్యవస్థలోని అన్ని విభాగాలపై పెత్తనం చెలాయిస్తున్న కూటమి నేతలు ఇసుక డిపోలను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లాలో ఇసుక రీచ్ లేనందున ఆరు ప్రైవేట్ ఇసుక డిపోల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లను పిలిచింది. వీటిలో అత్యధిక డిమాండ్ ఉన్న నక్కపల్లి, అచ్యుతాపురం, అనకాపల్లి, నర్సీపట్నం డిపోలపై కూటమి పెద్దలు కన్నేశారు. ఆ నాలుగు టెండర్లు ఏదోలా వారు దక్కించుకునేందుకు రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారు. ఇసుక డిపో ఏర్పాటు కోసం 4 ఎకరాల స్థలాన్ని రైతుల నుంచి లీజుకు తీసుకునేందుకు ఆయా సంస్థలు సమర్పించిన పత్రాలకు స్థానిక తహసీల్దార్లు నిరంభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) మంజూరు చేయాల్సి ఉంటుంది. రెవెన్యూ కార్యాలయాల్లో ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఏదో ఒక సాకుతో పక్కన పెట్టమని అధికారులను కూటమి పెద్దలు ఆదేశించినట్లు సమాచారం. ఫలానా సంస్థలకే ఈ ప్రైవేటు ఇసుక డిపోలను ఇవ్వాలని చెప్పడంతో వారికి మాత్రమే ఎన్‌వోసీలు జారీ చేస్తున్నట్టు విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ మొత్తం తతంగాన్ని అమరావతి నుంచే కూటమి పెద్దలు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నడిపిస్తున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వ పెద్దలు, సంబంధిత శాఖ మంత్రి అండదండలున్న సంస్థలు, పొరుగు జిల్లాలో టెండర్లు దక్కించుకున్న సంస్థల వారు టెండర్లకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. జిల్లాలో ఎక్కువగా డిమాండ్ ఉన్న అనకాపల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, నర్సీపట్నం యార్డులను అమరావతి పెద్దలు హోల్డ్ చేయించుకున్నారని తెలుస్తోంది. పెద్దగా డిమాండ్ లేని చోడవరం, మాడుగుల డిపోలను మాత్రం స్థానికులకు వదిలేయనున్నట్లు వినికిడి.

ఆరు డిపోలకు 65.. ఎన్‌వోసీలకు 16 దరఖాస్తులు

జిల్లాలో ఏర్పాటు చేస్తున్న ఆరు ఇసుక డిపోల కోసం గురువారం సాయంత్రం 5 గంటలకు 65 దరఖాస్తులు వచ్చినట్లు మైనింగ్ అధికారులు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా అనకాపల్లి ఇసుక డిపోకు 20 దరఖాస్తులు వచ్చాయి. తరువాత నక్కపల్లి డిపోకు 13, అచ్యుతాపురం డిపోకు 14, నర్సీపట్నం డిపోకు 10, చోడవరం డిపోకు 5, మాడుగుల డిపోకు 3 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉంది. డిపోల కోసం ఇంతవరకు 65 దరఖాస్తులు రాగా ఎన్‌వోసీ కోసం మాత్రం ఆరు చోట్ల నుంచి 16 దరఖాస్తులే వచ్చాయి.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత

- సమష్టి కృషితో లక్ష్యం సాధించాలి
- డీఈవో అప్పారావునాయుడు సూచన

చోడవరం రూరల్: రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు ఆకాంక్షించారు. అక్కడితో ఆగకుండా అత్యధిక మార్కులను సాధించి జిల్లా, మండల స్థాయిలో విద్యార్థులు మెరవాలని కోరారు. గురువారం ఉదయం ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులకు సోషల్ స్టడీస్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతిలో హాజరు, విద్యార్థుల ఆకళింపును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టెన్త్ ఉత్తీర్ణతలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. అనంతరం సంక్షేమ వసతి గృహ నిర్మాణం కోసం తాజాగా మంజూరైన స్థలాన్ని పరిశీలించారు. మండల విద్యాశాఖ కార్యాలయం, భవిత కేంద్రం, ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలను సందర్శించారు. చాలాకాలంగా పాఠశాలకు గైర్హాజరవుతున్న లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి సత్తిబాబుతో మాట్లాడి, సమస్యను అడిగి తెలుసుకుని, లక్ష్మీపురం పాఠశాల ప్రధానోపాధ్యాయునికి ఫోన్లో ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వంటశాలలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయనతోపాటు సీసీ వెంకటేశ్వరరావు, ఎంఈవో తిరుపతిరావు, సీఆర్పీ కె.వి.మహాలక్ష్మినాయుడు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని శ్రీవల్లి పాల్గొన్నారు.



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

న్యూస్‌రీల్

ఖైదీలకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

చోడవరం రూరల్: ఆర్థిక స్తోమత లేని రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ తెలిపారు. గురువారం ఆమె స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ రిమాండ్ ఖైదీ నేరస్తుడు కాదన్నారు. అభియోగం రుజువయ్యే వరకు నిందితునిగానే పరిగణించాలన్నారు. హక్కులను, రిమాండ్ ఖైదీలకు సబ్ జైలులో ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సెంట్రల్ జైల్ జైలర్ రాము, ప్యానెల్ న్యాయవాది భూపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఎంఎస్‌ఎంఈల సర్వే



ఇండస్ట్రీస్ జీఎం నాగ రాజారావు

తుమ్మపాల: ఈ నెల 29 నుంచి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈలు) సర్వే ప్రారంభమవుతుందని ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో ఎంఎస్‌ఎంఈలను గుర్తించి, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 1 నాటికి సర్వే పూర్తి కావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మున్సిపాలిటీలు, మండలాల పరిధిలో జరిగే సర్వేలకు కమిషనర్లు, ఎంపీడీవోలు నోడల్ అధికారులని, జిల్లా స్థాయిలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ నోడల్ అధికారిగా ఉంటారని పేర్కొన్నారు. సర్వే కోసం ప్రభుత్వం ఒక మొబైల్ యాప్ రూపొందించిందన్నారు. యాప్ ద్వారా వివరాలు సేకరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఆరుగురు సిబ్బందిని తీసుకోవాలని కమిషనర్లకు, ఎంపీడీవోలకు సూచించినట్లు తెలిపారు. ప్రతి సచివాలయ ఉద్యోగి రోజుకు కనీసం ఆరు సర్వేలు పూర్తి చేయాలన్నారు. రోజువారీ వివరాలు డాష్ బోర్డుపై కనిపిస్తాయని, తద్వారా మున్సిపల్, మండలాల పరిధిలో ఏ మేరకు సర్వే జరిగిందో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే



జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఘన నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- బడుగుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు నివాళి

దేవరాపల్లి: మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలో పూలే వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని, ఆ దిశగా పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని ఆయన కొనియాడారు. ఆయన స్త్రీ, పురుష సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన సామాజిక విప్లవ యోధుడని, నేటి యువత పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, నాగిరెడ్డి శతారినాయుడు, గంధం రామకృష్ణ, ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ, పోతల వెంకటరావు, వరదపురెడ్డి లలితానాయుడు, చల్లా నాయుడు, భగత వెంకటరమణ, దాసరి మంగునాయుడు, కె.ఎస్. అప్పలనాయుడు, చలుమూరు చంద్రమోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పాతర

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలకు పాతర వేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తారువలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలంటూ ఎన్నికల్లో ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక కుంటి సాకులతో తప్పించుకోవడం దారుణమన్నారు. తల్లికి వందనం, ఆడ బిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, రైతులకు రూ.20 వేల పెట్టుబడి సహాయం.. తదితర హామీలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి, ఆ ప్రకారం నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, ఫీజు రీయింబర్స్‌మెంట్, వాహన మిత్ర తదితర పథకాలను అమలు చేసి అన్ని వర్గాలకు ఆర్థిక తోడ్పాటును అందించారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి

- ఆయా ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు
- రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన
- వివిధ శాఖల సమీక్షలో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 26 ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించామని, ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఆర్ అండ్ బీ శాఖ, పంచాయతీరాజ్, జాతీయ రహదారి అధికారులు, రవాణా శాఖ, పోలీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ స్పాట్లలో రోడ్లపై విద్యుద్దీపాలు, రోడ్డు భద్రతకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, కేట్ ఐలను ఏర్పాటు చేస్తున్నామని, అక్రమ మీడియన్లను మూసివేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా పెండింగ్ చలానాలను కట్టే విధంగా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ పెట్టుకోనివారు, రాంగ్ రూట్లో వచ్చే వాహనాలు, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదల నివారణకు స్కూల్, కాలేజ్ విద్యార్థులకు, యువతకు అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, ఎంవీ ఇన్‌స్పెక్టర్లు ప్రకాష్‌రావు, మూర్తి, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రెండో స్థానం

కొక్కిరాపల్లి గురుకుల విద్యార్థినుల ప్రతిభ

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యార్థినులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల పల్నాడు జిల్లా సత్తెనపల్లి గురుకులంలో ఫ్యూచరాన్–2024 పేరుతో రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ గురుకులాల వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ పోటీల్లో స్థానిక కొక్కిరాపల్లి గురుకులం విద్యార్థినులు ప్రకృతి విపత్తుల సమయంలో వరదలు సంభవించినపుడు చేపట్టాల్సిన నివారణ చర్యలపై వినూత్నంగా రూపొందించి ప్రదర్శించిన ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో రెండో స్థానం లభించిందని గురుకులం ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం గురువారం మీడియాకు తెలిపారు. ద్వితీయ బహుమతికి ఎంపికైన ప్రాజెక్టు తయారుచేసిన విద్యార్థులకు జ్ఞాపికతోపాటు రూ.5 వేల నగదు బహుమతి లభించినట్టు చెప్పారు. ప్రాజెక్టును రూపొందించిన 9వ తరగతి విద్యార్థులు పి.లక్ష్మీప్రియ, బి.త్రివేణి, గైడ్ టీచర్లు ఎల్.వరలక్ష్మి, సిహెచ్.వి.ఎస్.ఎల్.కుమారిలను గురువారం గురుకులంలో జరిగిన కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థినులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న కొక్కిరాపల్లి గురుకులం విద్యార్థినులు

పీఆర్సీని పునరుద్ధరించాలి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ డిమాండ్

చోడవరం: పీఆర్సీని పునరుద్ధరించి, మధ్యంతర భృతిని చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ డిమాండ్ చేశారు. యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చోడవరం మండలంలో ప్రారంభించారు. గోవాడ, జుత్తాడ, లక్కవరం, గవరవరం, లక్ష్మీపురం, చోడవరం ప్రభుత్వ, జెడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జీవో 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యా వ్యవస్థకు పునర్జీవం పోయాలన్నారు. పాఠశాలల పని వేళలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే ఉంచాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ మద్దతుతో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎంవీ స్వామి, వీవీ శేషగిరిరావు, జి.సింహాద్రి, కె.ప్రతినాథ, ఎం.వసుందరదేవి, తదితరులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులతో జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

కిరండూల్‌కు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్, డిసెంబరు 6,8,10,12,14,16,18,20,22, 24,26,28,30, జనవరి 1వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌లను జతచేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 2వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు 1–స్లీపర్ క్లాస్ కోచ్, డిసెంబరు 7,9,11,13,15,17,19,21,23,25,27,29,31, జనవరి 2వ తేదీల్లో 1–థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో జరగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిసెంబరు 6న పూరీ–యశ్వంత్‌పూర్(22883) ఎక్స్‌ప్రెస్, డిసెంబరు 7న యశ్వంత్‌పూర్–పూరి(22884) ఎక్స్‌ప్రెస్, డిసెంబరు 4, 11వ తేదీల్లో హౌరా–యశ్వంత్‌పూర్(22931) ఎక్స్‌ప్రెస్, డిసెంబరు 6,13వ తేదీల్లో యశ్వంత్‌పూర్–హౌరా(22832) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించబడిన మార్గంలో వయా నంద్యాల, యర్రగుంట్ల, గుత్తి, అనంతపూరు మీదుగా నడుస్తాయి.

క్లుప్తంగా

చాకిరేవులో కింగ్ కోబ్రా హల్‌చల్



మాడుగులలో నల్ల త్రాచును పట్టుకుంటున్న పాముల కేచర్ వెంకటేష్

మాడుగుల: మాడుగుల చాకిరేవు వద్ద గురువారం ఉదయం కింగ్‌కోబ్రా (నల్ల త్రాచు) హల్‌చల్ చేసింది. వేరే పాములను మింగి, దుస్తులు ఉతికే ట్యాంకులో ఉంది. ఎప్పటిలాగే రజకులు దుస్తులు తీస్తుంటే బసలు కొడుతూ మీదకు దూకింది. త్రుటిలో ప్రమాదం తప్పడంతో రజకులంతా పొలాల్లోకి పరుగులు తీశారు. అక్కడి రైతులు పాముల కేచర్ వెంకటేష్‌కు సమాచారం అందజేశారు. పాముల కేచర్ పెచ్చేటి వెంకటేష్ కింగ్ కోబ్రాను పట్టుకుని, చోడవరం ఫారెస్టు అధికారుల ఆదేశాలతో సమీప రిజర్వ్ ఫారెస్టులో విడిచి పెట్టారు. వెంకటేష్‌ను ఫారెస్టు అధికారులు అభినందించారు.

మద్యం అక్రమ రవాణా : ఇద్దరు అరెస్టు



అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తులతో ఎక్సైజ్ పోలీసులు

దేవరాపల్లి/చోడవరం రూరల్: కొత్తపెంట గ్రామంలో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు చోడవరం ఎక్సైజ్ సీఐ కె.వి.బాపునాయుడు గురువారం తెలిపారు. మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారంతో కొత్తపెంట రోడ్డులో మాటు వేసి ఎస్. అప్పారావు, కె.నారాయణరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 39 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

గ్రావెల్, బండ రాళ్ల రవాణాపై అధికారుల దాడి



అధికారులు దాడి చేసి పట్టుకున్న ట్రాక్టర్లు

రోలుగుంట: కుసుర్లపూడి నుంచి అక్రమంగా నర్సీపట్నం వైపు గ్రావెల్, బండరాళ్లు తరలిస్తున్న ట్రాక్టర్లపై రోలుగుంట పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడి చేశారు.జె.పి.అగ్రహారంలో ఈ ట్రాక్టర్లు ఆపి తనిఖీలు చేశారు. డ్రైవర్ల వద్ద ఏ విధమైన అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని రోలుగుంట పోలీసు స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ అధికారులకు తదుపరి చర్యల కోసం అప్పగిస్తామని విలేకరులకు తెలిపారు.

సంఘమిత్ర... సేవా తృష్ణ

మాడుగుల నియోజకవర్గంలో గల నాలుగు మండలాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రముఖంగా వినిపించే పేరు సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ. ఈ సొసైటీ ద్వారా సంఘమిత్ర సభ్యులు మెగా వైద్య శిబిరాలతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. విశాఖపట్నంలో ప్రముఖ వైద్యులను ఈ వైద్య శిబిరాలకు రప్పించి గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ఆయా ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఉన్నతమైన ఆశయాలతో ఏర్పడి దిన దినం సేవలు విస్తృత పరుస్తున్న ఈ సొసైటీ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తి చేసుకుంది.

- పల్లె ప్రజలకు అండగా విస్తృత కార్యక్రమాలు
- ఉన్నత స్థానాల్లో ఉండి గ్రామీణులకు సేవలు అందిస్తున్న సభ్యులు
- ఇప్పటి వరకూ 210 వైద్య శిబిరాలు
- సొసైటీ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తి

కె.కోటపాడు: విశాఖపట్నంలో ప్రముఖ ఈఎన్‌టీ ప్రొఫెసర్ బండారు రామచంద్రరావు స్వగ్రామం కె.కోటపాడు మండలం గొండుపాలెం గ్రామం. ఆయన తన స్నేహితులైన 10 మంది ఉద్యోగులతో కలిసి 20 ఏళ్ల క్రితం నవంబర్ 24న సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేశారు. సొంత ప్రాంతంలో కొంతయినా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్న లక్ష్యంతో ఈ ఈ సొసైటీ ఏర్పాటు చేశారు. 10 మంది సభ్యులతో ప్రారంభమైన సంఘమిత్ర సొసైటీలో నేడు 100 మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరంతా సంఘమిత్ర నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమంలో కూడా పాల్గొని సహకారం అందిస్తారు. సొసైటీ ప్రారంభించిన నాటి నుంచి సుమారు 210 మెగా, సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ వైద్య శిబిరాలలో కొన్నింటిని దేవరాపల్లి మండలం ఏజెన్సీ గ్రామాల్లోను నిర్వహించి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించారు.



దివ్యాంగులకు కృత్రిమ అవయువాల పంపిణీ

అలాగే బాలికలు, మహిళల్లోను రక్తహీనత సమస్య లేకుండా ఉండేందుకు హెచ్‌బీ పరీక్షలను నిర్వహించి, రక్తం వృద్ధికి ఐరన్ సుక్రోజ్ సిరప్‌లతో పాటు మాత్రలను అందిస్తున్నారు.

గ్రామీణ విద్యాజ్యోతి ఉపకార వేతనాలు

ప్రతి ఏటా కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో



దివ్యాంగులకు వీల్ చైర్లు అందిస్తున్న సంఘమిత్ర సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో టాపర్‌లుగా నిలుస్తున్న 100 మంది విద్యార్థులకు సొసైటీ సభ్యులు గ్రామీణ విద్యాజ్యోతి పథకం ద్వారా స్కాలర్‌షిప్ నగదును అందిస్తున్నారు. పదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామీణ విద్యార్థులు చదువుల్లో పోటీతత్వాన్ని చూపి మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, జీవన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని అధికారులతో స్ఫూర్తిదాయక అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి గౌరవ పురస్కారాలు సంస్థ తరఫున అందిస్తున్నారు.

క్రీడాకారులకు అండగా..

గ్రామాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అండగా నిలిచేందుకు సంఘమిత్ర సభ్యులు గ్రామీణ క్రీడాజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీలను నిర్వహించి ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ఆయా రంగాల్లో రాణించేందుకు ఉచిత శిక్షణతో పాటు సంబంధిత వసతులు కల్పిస్తున్నట్టు సభ్యులు తెలిపారు. గ్రామాల్లో మన ఊరు–మన చెట్టు కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటుతున్నారు.

ఉచితంగా వీల్ చైర్లు, కృత్రిమ అవయవాలు

వైద్య శిబిరాలు నిర్వహించే సమయాల్లో దివ్యాంగులు వైద్యం పొందేందుకు వస్తుంటారు. వీరిలో అవసరమయిన వారికి సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా సంఘ అధ్యక్షుడు బండారు రామచంద్రరావు రూ.5వేలు విలువైన వీల్ చైర్లు, రూ.10వేలు విలువైన కృత్రియ అవయవాలతో పాటు రూ.10వేలు విలువైన వినికిడి యంత్రాలను అందజేస్తున్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నా. సెలవు రోజుల్లో మా ప్రాంతంలో నిర్వహించే సంఘమిత్ర సొసైటీ ద్వారా నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాను. పట్టణాల్లో ఉండే ప్రముఖ వైద్యులను ఈ ఉచిత వైద్య శిబిరాలను రప్పించి మెరుగైన వైద్యంతో పాటు మందులు అందించే కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ సేవా కార్యక్రమాలతో నాలో ఎనలేని సంతృప్తి కలుగుతుంది.

–బి.మంగపతి, ఉపాధ్యాయుడు, సంఘమిత్ర సభ్యుడు, గొండుపాలెం

10 మందితో మొదలై....



సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీని 10 మంది తోటి స్నేహితులతో కలిసి ఏర్పాటు చేయాలని 20 ఏళ్ల క్రితం సంకల్పించుకున్నాం. మేం చేస్తున్న సేవలు చూసి గ్రామాల్లో గల స్నేహితులు కూడా సొసైటీలో చేరారు. 20 ఏళ్లలో ఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామాల్లో పేదవారి చెంతకు ఖరీదైన స్పెషలిస్ట్ వైద్యం అందించగలిగాం. ఉచితంగా మందులతో పాటు ఖరీదైన కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు వీల్‌ఛైర్‌లను అందించాం. ఈ నెల 24న కె.కోటపాడులో సంఘమిత్ర సొసైటీ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తవడం పట్ల వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

–డాక్టర్ బండారు రామచంద్రరావు, సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు

అత్తవారి తోటలో వ్యక్తి ఆత్మహత్య!

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం గురందరపాలెంలోని అత్తవారి తోటలో అల్లుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్సై రాజారావు అందించిన వివరాలు.. జె.ప్రసాద్ (38) అనకాపల్లిలో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురందరపాలేనికి చెందిన ధనలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలు గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. ధనలక్ష్మి గురందరపాలెంలోని అమ్మవారి ఇంటి వద్ద ఉంటోంది. బుధవారం రాత్రి ప్రసాద్ గురందరపాలెం వచ్చాడు. ఊరి చివరిలో ఉన్న అత్తవారికి చెందిన తోటలో చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. సంఘటన స్థలంలో అతని ద్విచక్ర వాహనం ఉంది. మద్యం సీసా కూడా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టుకు వేలాడుతున్న ప్రసాద్ మృతదేహం

రైలు ఢీకొని మహిళ దుర్మరణం

యలమంచిలి రూరల్: రేగుపాలెం రైల్వేస్టేషన్‌కు సమీపంలో డౌన్‌లైన్‌లో రైలు ఢీకొని గురువారం యలమంచిలి మండలం పేట బయ్యవరం గ్రామానికి చెందిన కొయ్య లక్ష్మి(36) మృతి చెందింది. అవివాహిత అయిన లక్ష్మి బయ్యవరంలో మేనమామ ఇంటివద్ద ఉంటోంది. గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా రైలు పట్టాలు దాటుతున్న సమయంలో హౌరా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను మేనమామ కుమారుడు కిల్లాడి అప్పలనాయుడు గమనించి భుజాలపై వేసుకుని గ్రామంలోకి తీసుకొచ్చి చికిత్స నిమిత్తం ఆటోలో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. తలకు బలమైన గాయమై అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను పరీక్షించిన డ్యూటీ డాక్టర్ అప్పటికే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు చెప్పారు. మతిస్థిమితంలేని కారణంగా లక్ష్మి కొంతకాలంగా విశాఖపట్నం మానసిక చికిత్సాలయంలో వైద్యం చేయించుకుంటోందని కుటుంబ సభ్యులు తుని రైల్వే పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తుని రైల్వే పోలీసులు ప్రమాద స్థలానికి వచ్చి ప్రమాదంపై ఆరా తీశారు. బహిర్భూమికి వెళ్లి వస్తున్న లక్ష్మి రెండు రైల్వే లైన్లపై నుంచి ఆ సమయంలో రెండు రైళ్లు ఒకేసారి రావడంతో తికమకపడి మధ్యలో ఉండిపోవడంతో ప్రమాదానికి గురై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి మేనత్త నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి. శ్రీనివాసరావు తెలిపారు.



రైలు ఢీకొని మృతి చెందిన కొయ్య లక్ష్మి

పీఎం సూర్యఘర్‌తో రాయితీపై సోలార్ యూనిట్

- శతశాతం సౌర విద్యుత్ గ్రామంగా గుల్లేపల్లిని నిలపాలి
- అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

సబ్బవరం: దేశ భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామాన్ని సోలార్ మోడల్ గ్రామంగా గుర్తించడంతో గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని శత శాతం సోలార్ గ్రామంగా రూపుదిద్దుకుని, జిల్లాతో పాటు రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా రాయితీ అందిస్తుందన్నారు. దీంతో పాటు మిగిలిన మొత్తానికి అవసరమైతే బ్యాంకులు రుణ సదుపాయాన్ని కల్పిస్తాయన్నారు. ప్రస్తుతం పెట్టే పెట్టుబడి మూడేళ్లలో తిరిగి వస్తుందన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌లో వాడకం మినహా, మిగులు విద్యుత్‌ను ఈపీడీసీఎల్‌కు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు నిల్వలు తరిగిపోవడంతో భవిష్యత్తు అంతా పునరుత్పాదక ఇంధన వనరులదేనన్నారు. గ్రామంలో సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటుకు డబ్బులు చెల్లించిన వారికి ఫీజిబిలిటీ సర్టిఫికెట్లను అందించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ సోలార్ యూనిట్ ఏర్పాటుకు కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.70 వేలు వరకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని గుల్లేపల్లి గ్రామాన్ని సోలార్ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. శత శాతం సోలార్ సాధించిన గ్రామానికి ప్రభుత్వం రూ.కోటి ప్రోత్సాహకంగా అందించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు మరిన్ని నిధులు కేటాయిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బండారు మంగ, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, డీపీవో శిరీషారాణి, ఎంపీడీవో పద్మజ, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ జి.ప్రసాద్, ఈఈ నిరంజన్ అంబేద్కర్, ఏఈలు వీరేంద్ర, అశోక్, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు ఫీజిబిలిటీ సర్టిఫికెట్లను అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

సారా తయారీకి బెల్లం అమ్మకాలు చేయరాదు



బెల్లం వ్యాపారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్ సింగ్

అనకాపల్లి: బెల్లం వ్యాపారి ఒకేసారి 4 వేల క్వింటాళ్ల బెల్లం కంటే అధిక బెల్లం నిల్వ ఉంచరాదని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ సూర్జిత్ సింగ్ అన్నారు. స్థానిక జిల్లా వర్తక సంఘం ఆధ్వర్యంలో జిల్లా బెల్లం వర్తకులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీయూఆర్ రెగ్యులేషన్ ఆర్డర్ 1968 ప్రకారం వర్తకులంతా ప్రతినెలా మొదటి వారంలో నెలవారి బెల్లం క్రయవిక్రయాలకు సంబంధించిన రిపోర్టు సమర్పించాలని ఆయన కోరారు. ప్రతి వ్యాపారి లైసెన్స్ కలిగిన వ్యక్తులు మాత్రమే వ్యాపారం చేయాలన్నారు. వ్యాపారులు ఎవరూ నాటు సారా తయారీదారులకు గాని నాటుసారా తయారు చేసే వ్యక్తులకు బెల్లం సరఫరా చేసే వ్యాపారులకు గాని బెల్లం అమ్మరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, అనకాపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మణ నాయుడు, జిల్లా బెల్లం వర్తకుల సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ(పెదబాబు), బెల్లం వ్యాపారులు పాల్గొన్నారు.

6 నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు క్రీడా పోటీలు

దాబాగార్డెన్స్ (విశాఖ): ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చే నెల 6 నుంచి 8 వరకు క్రీడా పోటీలు కైలాసగిరి పోలీస్ క్రీడా ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ మేరకు ఆర్టీసీ జోన్-1 ఇన్‌చార్జి ఈడీ విజయ్‌కుమార్ ఆర్టీసీ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలతో గురువారం ఎంవీపీ బస్ స్టేషన్, ఈడీ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో సీఎంఈ(ఎం) జి.విజయ రత్నం, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి, విజయనగరం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ, విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎం.సుధాబిందు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనంతుని దీపోత్సవం చూతము రారండి

- రేపు అనంత పద్మనాభ స్వామి ఇంట దివ్వెల కొలువు
- సాయంత్రం 5.30 గంటలకు ఉత్సవం ప్రారంభం

ఉత్తరాంధ్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం రానే వచ్చింది. రాష్ట్రంలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న ఈ ఉత్సవం ఈ నెల 30న నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. దీపాలను ప్రత్యక్షంగా వెలిగించేందుకు.. వేడుకను కనులారా వీక్షించేందుకు ఆ రోజున పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

– పద్మనాభం

ఒకే చోట శైవ, వైష్ణవ ఆలయాలు ఉండడం పద్మనాభం ప్రత్యేకత. అందులోనూ కార్తీకమాసంలో శివ పూజకు అనువైన వాతావరణం కలిగి ఉండడంతో పాటు వైష్ణవ సంప్రదాయం కలిగిన అనంత పద్మనాభుడి గిరి మెట్ల పంక్తిపై శైవ సంప్రదాయాన్ని ప్రతిబింబించే దీపోత్సవం నిర్వహించడం.. అలనాటి శైవ, వైష్ణవ భక్తుల అద్భుతమైన అనుబంధాన్ని చాటి చెబుతుంది. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం ఉత్తరాంధ్ర సాంస్కృతిక వారసత్వానికి ఒక నిదర్శనం.





ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం

దీపోత్సవం శనివారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుంది. గిరిపైన జేగంట మోగగానే భక్తులు ఒక్కసారిగా దీపాలు వెలిగిస్తారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన అనంత పద్మనాభ స్వామి చిన్న ఉత్సవ విగ్రహాలు గిరి దిగువున ప్రథమ పావంచా వద్ద కొలువు తీరుతాయి. గిరిని అధిరోహించే ముందు భక్తులు ప్రథమ పావంచా వద్ద కొలువై ఉన్న అనంతుడి ఉత్సవ విగ్రహాలను దర్శించుకుంటారు. గిరి ప్రథమ పావంచా సన్నిధిలో 12 అడుగుల ఎత్తు ఉన్న శివుని విగ్రహం సాక్షాత్కరిస్తుంది. గిరి పైకి వెళ్లే భక్తులు 1,200 మెట్టు వద్ద కొలువు దీరనున్న శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలను దర్శించుకుంటారు. ఉత్సవంలో భాగంగా మెట్లకు సున్నం వేశారు. మెట్లకిరువైపులా ఉన్న తుప్పలు, డొంకలు తొలగించారు.దీపాలు వెలిగించడానికి అవసమైన నూనె, 5 వేల ప్రమిదలు, 5 వేల వత్తులు సమకూర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గిరిపై ఆలయంలోకి ప్రవేశం లేదు

గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయంలోకి, ఘాట్ రోడ్డు ద్వారా గిరిపైకి భక్తులకు ప్రవేశం లేదని ఏసీపీ అప్పలరాజు తెలిపారు. ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులు జరుగుతున్నందున ఆలయంలోకి భక్తులకు ప్రవేశం లేదని తెలిపారు. ఘాట్ రోడ్డుకు ఒక వైపు రక్షణ గోడలు లేకపోవడంతో రోడ్డు మార్గం ద్వారా భక్తులు వెళ్లకూడదన్నారు.

పద్మనాభం ప్రత్యేకత

అనంత పద్మనాభ స్వామి ప్రాచీన ఆలయాలు భారతదేశంలో రెండు చోట్ల ఉన్నాయి. అందులో ఒకటి కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, రెండోది మన జిల్లాలోని పద్మనాభం గ్రామంలోని గిరిపై ఉంది. ఎక్కడా జరగని విధంగా ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున అనంత పద్మనాభ స్వామి కొండ మెట్ల పంక్తిపై దీపాలంకరణ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. గిరి పాదం నుంచి గిరి శిఖరం వరకు 1,200 మెట్లకిరువైపులా తైల దీపాలంకరణ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించి.. హైందవ సంప్రదాయ విశిష్టతను ఎల్లెడలా వ్యాపింపజేస్తున్నారు ఈ ప్రాంత భక్తజనం. స్వామి వారి దీపోత్సవంలో పాల్గొంటే స్వర్గలోకం ప్రాప్తిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. మహిళలు తాము పుణ్యవతులు కావడానికి కార్తీక దీపోత్సవంలో పాల్గొనడమే ఉత్తమమని భావిస్తారు. అందుకే దీపోత్సవం జరిగే రోజు మధ్యాహ్నం నాటికే వీరు పద్మనాభం చేరుకుని దీపాలు వెలిగించడానికి కొండ మెట్లను పోటీ పడి రిజర్వ్ చేసుకుంటారు.

తుపాను నేపథ్యంలో రైతులకు సలహాలు

దేవరాపల్లి/చీడికాడ : తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి సాగు చేసిన రైతులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు సూచించారు. ఆయన గురువార దేవరాపల్లి మండలంలోని కలిగొట్ల, బోయిలకింతాడ గ్రామాల్లోనూ, చీడికాడ మండలం తునివలస, చుక్కపల్లి, పెదగోగాడ, జి.కొత్తపల్లి గ్రామాల్లో క్షేత్ర స్థాయిల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు. వరికోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోతలు పూర్తి చేసిన వారు పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించి, కుప్పలు పెట్టుకుని, గాలికి ఎగిరిపోకుండా టర్పాలిన్లు మూసి వాటిపై బరువు ఉంచాలని తెలిపారు. వరి కోతలు వాయిదా వేయాలని రైతులకు వివరించాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆయా మండల వ్యవసాయాధికారులు, మండల విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సైకిల్‌పై శబరిమల యాత్ర



శబరిమలకు సైకిల్‌పై బయలు దేరిన స్వామి

చోడవరం: సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలు దేరిన బొడ్డపు స్వామికి చోడవరం, పరిసర గ్రామాల్లో అయ్యప్పస్వాములు వీడ్కోలు పలికారు. చోడవరం అన్నవరానికి చెందిన స్వామి 41వ రోజుల అయ్యప్ప స్వామి దీక్ష మాల వేశారు. మొక్కును చెల్లించేందుకు సైకిల్‌పై శబరిమల వెళ్లేందుకు సంకల్పించారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం దగ్గర నుంచి యాత్రను గురువారం ప్రారంభించారు.

క్లుప్తంగా

ఏడాదిలో 115 బాల్య వివాహాల నిలుపుదల



వెంకుపాలెంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడ్స్ ప్రతినిధులు

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, బాల్య వివాహ ముక్త్ భారత్ పిలుపు మేరకు సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ (సీడ్) ఆధ్వర్యంలో మండలంలో 50 గ్రామాల్లో బాల్య వివాహాలపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. సీడ్స్ డైరెక్టర్ వి.సన్యాసిరాజు మాట్లాడుతూ 50 గ్రామాల్లో 8580 మంది విద్యార్థులు ప్రజలకు బాల్య వివాహాల గురించి వివరించినట్లు తెలిపారు. 2023–24లో 115 బాల్య వివాహాలను అడ్డుకున్నాం అన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో ఈనెల 29న విద్యుత్ వైర్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ నిలుపుదల జరుగుతుందని ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డి–1 సెక్షన్ పరిధిలో నర్సింగరావుపేట, చింతావారి వీధి, తాకాశివీధి, పెరుగుబజార్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

డిసెంబర్ 1న విద్యార్థులకు నమూనా పరీక్ష

కశింకోట: స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న రెండు హైస్కూళ్లలో జాతీయ ఉపకార వేతనం కోసం పరీక్షకు సిద్ధమవుతున్న 8వ తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు ఆచంట నాగేశ్వరరావు, డి. నూకేష్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఒక బ్యాచ్, 9 గంటలకు మరో బ్యాచ్ విద్యార్థులకు కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, మునగపాక హైస్కూళ్లలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు పరీక్ష పేపర్లను మూల్యాంకన చేసి 180 మార్కులకు 110 మార్కులు దాటిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 3,566 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,500	4,360
మొదటి రకం	3,380	3,800
రెండో రకం	3,110	3,670
మూడోరకం	2,840	3,100

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్–1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్–2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 30 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–6 యూనిట్లు, బీ పాజిటివ్–11 యూనిట్లు, ఓ పాజిటివ్–12 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు. లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి:ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.

- అధ్వాన స్థితిలో డ్రైనేజీ వ్యవస్థ
- స్వైరవిహారం చేస్తున్న దోమలు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

అపారిశుధ్యంతో అవస్థలు



ఎల్లయ్య కాలువలో పేరుకుపోయిన చెత్త



చెత్తా చెదారంతో నిండిపోయిన నాగులాపల్లి కాలువ

అనకాపల్లి: జోనల్ పరిధిలో పారిశుధ్యం మెరుగుపరచడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధానమైన ఎల్లయ్యకాలువ, నాగులాపల్లి కాలువ, పులికాలువ, చెర్లోపల్లి కాలువలు పట్టణం మీదుగా మండలంలో ప్రవహిస్తాయి. వీటికి అనుసంధానంగా 80వ వార్డు నుంచి 84వ వార్డులో అనేక చిన్న, పెద్ద కాలువలు ఉన్నాయి. జోనల్ పరిధిలో సుమారు 2 లక్షల 10 వేల మంది నివసిస్తున్నారు. అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఇక్కడే నివసిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కావలసిన మౌలిక సదుపాయలు కల్పించడంలో అధికారులు విఫలమైనట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని వాపోతున్నారు.

ఎల్లయ్య కాలువ..

సుమరు రెండు కిలోమీటర్ల రహదారిలో ఎల్లయ్య కాలువ పట్టణం మీదుగా ప్రవహిస్తోంది. మండలంలో తుమ్మపాల పంచాయతీ గుండా జంక్షన్ నుంచి ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం, లక్ష్మీదేవిపేట, వేల్పులవీధి, ఎన్టీఆర్ ఆస్పత్రి, నూకాంబిక అమ్మవారి రహదారి, గవరపాలెం, చాకలిపేట, సంతబయలు, జాతీయ రహదారి మీదుగా మండలంలో ఆవఖండం పొలంలో ప్రవహిస్తోంది. సుమారు 20 సంవత్సరాల క్రితం కాలువను పూర్తిస్థాయిలో నిర్మించి, మధ్యలో పొలాలకు నీరు ప్రవహించే విధంగా ఏర్పాటు చేశారు. కాలువకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఈ కాలువపై పర్యవేక్షణ లేకపోవడంతో చెత్తా చెదారం కాలువ, డ్రైనేజీల్లో నిల్వ ఉండిపోయి దోమలు ప్రబలుతున్నాయి.

నాగులాపల్లి కాలువ..

నాగులాపల్లి కాలువ శారదా నది ఒడ్డున శ్రీరామ్‌నగర్ నుంచి బర్మాకాలనీ, ఎల్‌బీసీ కార్యాలయం మీదుగా జాతీయ రహదారి, మునగపాక మండలంలో నాగులాపల్లి మీదుగా పంట పొలాలకు చేరి నీరు అందిస్తుంది. ఈ కాలువలో కూడా చెత్తా చెదారం పెరిగిపోయింది.

పులికాలువ, చెర్లోపల్లి కాలువ..

మండలంలో తుమ్మపాల నుంచి లక్ష్మీదేవిపేట, రైల్వే స్టేషన్ రహదారి, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్, జాతీయ రహదారి ఆవఖండం భూముల్లో రైతుల పొలాకు ఈ కాలువ ద్వారా నీరు చేరుతుంది. ఈ కాలువకు పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతోంది.

రోడ్ల పైనే మురుగు నీరు..

పట్టణ పరిధిలో సుమారు 15 కిలోమీటర్లలో డ్రైనేజీ వ్యవస్థ ఉంది. ఆయా ప్రాంతాల ప్రజల వాడుక నీరు డ్రైనేజీలో కలుస్తుంది. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ పూడికతీత పనులు చేయకపోవడంతో చెత్తాచెదారం ఎక్కువగా ఉండిపోయి, వర్షాలు వచ్చినప్పుడు మురుగు నీరు రహదారి పైకి వచ్చి దుర్వాసన వ్యాపిస్తోంది. దోమలు ముసురుకుంటున్నాయి.

దోమల మందు పిచికారీ ఎక్కడ?

జోనల్ పరిధిలో దోమలను నిర్మూలించేందుకు డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్, దోమల మందులు పిచికారీ చేయాల్సి ఉంది. అయితే 5 వార్డుల పరిధిలో పట్టణ జనాభాకు తగ్గట్టుగా సిబ్బంది లేకపోవడంతో తూతూ మంత్రంగా దోమల మందు పిచికారీ చేస్తున్నారు. పట్టణ పరిధిలో బ్లీచింగ్ పౌడర్ కాలువల వద్ద జల్లే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

వ్యాధుల బారిన పడుతున్నాం..



దోమకాటుకు గురై జర్వం రావడంతో రూ.1500 ఖర్చు అయింది. నెల రోజులుగా దోమల సంచారం ఎక్కువగా ఉంది. రాత్రీ పగలు తేడా లేకుండా ప్రజలు దోమ కాటుకు గురి కావలసిన పరిస్థితి ఏర్పడుతుంది. వారం రోజుల క్రితం దోమ కాటుకు గురై తీవ్ర ఇబ్బంది పడ్డాను.

– సత్యనారాయణ, అనకాపల్లి

దోమల మందు పిచికారీ చేయాలి..



డ్రైనేజీల్లో తూతూ మంత్రంగా చెత్తా చెదారం తీస్తున్నారు. శీతాకాలంలో దోమల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఇంట్లో అన్ని తలుపులు బిగించుకుని ఉన్నప్పటికీ లోనికి ప్రవేశిస్తున్నాయి. రాత్రి సమయంలో నిద్ర లేకుండా చేస్తున్నాయి. పూర్తిస్థాయిలో దోమల మందు పిచికారీ చేయాలి.

– శ్రీను, నర్సింగరావుపేట, అనకాపల్లి

వరి రైతులు కోతలు వాయిదా వేసుకోవాలి



చెరకాంలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కశింకోట: తుపాను ముప్పు తొలగే వరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని అనకాపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు డి. రామారావు కోరారు. మండలంలోని అడ్డాం, చెరకాం గ్రామాల్లో ఇప్పటికే కోసిన వరి పంట క్షేత్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి పలు సూచనలు చేశారు. వరి పనలను కుప్పలుగా వేసుకుని వర్షాలకు తడవకుండా టార్పాలిన్లు వేసి మూయాలన్నారు. అలాగే తుపాను ముప్పు పూర్తిగా సమసిపోయిందని తెలిసే వరకు వరి కోతలు కోయరాదన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి ఆళ్ల నూకశ్రీనివాసరావు, ఉద్యానవన సహాయకులు బుద్ద కిషోర్, ఎంబీపీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి బీమా సొమ్ము అందజేత



కార్మికుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పరిశ్రమ జీఎం ప్రసాదరావు

కశింకోట: మండలంలోని బయ్యవరం వద్ద ఉన్న సాగర్ సిమెంట్ పరిశ్రమలో పని చేస్తూ ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి రూ.20 లక్షల బీమా పరిహారాన్ని గురువారం అందజేశారు. కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన కొల్లి నాగార్జునరావు పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 10న రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులకు కూడా గ్రూపు యాక్సిడెంట్ పాలసీని వర్తింపజేస్తుండటంలో భాగంగా నాగార్జున రావు కుటుంబానికి బీమా పరిహారం మంజూరు కావడంతో దాన్ని చెక్కు రూపంలో కుటుంబానికి అందజేసినట్లు పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎస్.వి. ప్రసాదరావు, ఏజీఎం (హెచ్ఆర్) పి.వి. పాండురంగారావు తెలిపారు. పరిశ్రమ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా నల్లమారమ్మతల్లి జాతర

మాకవరపాలెం : మండలంలోని జి.కోడూరులో నల్లమారమ్మతల్లి జాతరను వైభవంగా నిర్వహించారు. రెండేళ్లకొకసారి నిర్వహించే ఈ జాతరను స్థానికులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. జాతర రోజున స్థానికులు పశువులతో ఆలయానికి వెళ్లడం ఏళ్ల తరబడి అనాదిగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామస్తులంతా తమ పాడి పశువులతో స్థానిక సంతోషిమాత ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలు, పశువులతో కలసి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వికలాంగులు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కశింకోట: మండలంలోని జి. భీమవరం, పరవాడపాలెం గ్రామాల్లో గంటా యువసేన ఆధ్వర్యంలో గురువారం వికలాంగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర వీటిని అందజేశారు. కూటమి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. ఇప్పటి వరకు కిలో రూ.60 ఉండే క్యారెట్, బీట్రూట్ ధరలు అమాంతం రూ.100కు చేరాయి. అలాగే టమాటా ధర కూడా రూ.40 నుంచి రూ.60కి, ఉల్లిపాయల ధర నాణ్యతను అనుసరించి రూ.20 వరకు అదనంగా పెరిగింది. వీటిని నాణ్యత అనుసరించి వరుసగా రూ.50, రూ.60లకు విక్రయించారు. చిక్కుడు రూ.80, వంకాయలు కిలో రూ.60, బెండకాయ, దొండకాయ, బంగాళాదుంప రూ.40కి విక్రయాలు సాగాయి.

నక్కపల్లిలో నేడు ప్రజాదర్బార్

తుమ్మపాల: ఈ నెల 29న ఉదయం 8 గంటలకు నక్కపల్లి మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో పాయకరావుపేట నియోజకవర్గ స్థాయి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. హోం శాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మంత్రి వంగలపూడి అనిత హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. 'ప్రజాదర్బార్'కు జిల్లా అధికారులందరూ పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించిన తమ శాఖలోని మండల, డివిజనల్ స్థాయి అధికారులతో కలిసి స్వయంగా హాజరు కావాలని పేర్కొన్నారు.

రైతుల గుండెల్లో తుపాను

- వాయుగుండం ప్రభావం
- కోసిన వరి పంటను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు



తాటిపర్తిలో వరి పంటను ఒడ్డుకు చేర్చి కుప్పలు పెడుతున్న రైతులు



వరి పనలను కల్లాలకు తరలిస్తున్న రైతులు



కోమరవోలులో పంట భూమిలో కోసి ఉన్న వరి పొలం

మాడుగుల రూరల్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో పండిన వరి పంటను గతంలో కోసిన రైతులు ఒడ్డుకు చేర్చే పనిలో బిజీగా ఉన్నారు. మండలంలో 90 శాతం మేర వరి పంట పండింది. వాయుగుండం ప్రభావంతో రైతులు వరి కోతలు వాయిదా వేసుకున్నారు. మండలంలో 11 వేల ఎకరాల్లో వరి పంట వేశారు. ప్రస్తుతం పది శాతం కోతలు పూర్తయ్యాయి. తుపాను బారిన పడకుండా రైతులు తగు సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు గ్రామాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, ఉద్యానవనశాఖ సహాయకులు, రైతులకు అవగాహన కల్పించారు. దండోరా వేసి తుపాను ప్రభావం తగ్గే వరకూ నాలుగు నుంచి ఐదు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోసిన వరి పంటను పొలంలో లేదా చిన్న కుప్పలుగా పెట్టుకోవాలని సూచనలు చేశారు. వర్షాలకు వరి పనలు తడిసిపోతే గింజ మొలక ఎత్తకుండా, గింజ రంగు మారకుండా ఉండడానికి 50 గ్రాముల కళ్లు ఉప్పు ఒక లీటరు నీటిలో కలిపి వరి పనలు మీద పిచికారీ చేసుకోవాలన్నారు.

మాకవరపాలెం : మండలంలో ఈ ఏడాది 1410 హెక్టార్లలో వరిపంట సాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన కొండల అగ్రహారం, గిడుతూరు, మల్లవరం, మాకవరపాలెం, పి.పి.అగ్రహారం, తదితర ప్రాంతాల్లో రైతులు కోతలు ప్రారంభించారు. తుపాను హెచ్చరికలు జారీకావడంతో వరి పనలను పొలాల్లోనూ, సమీప కల్లాల్లో కుప్పలుగా పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. రైతులు ఆదివారం వరకు కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రోలుగుంట : తుపాను నేపథ్యంలో మండల రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సచివాలయాల్లోని గ్రామస్థాయి సహాయ వ్యవసాయాధికారుల ద్వారా రైతులకు సమాచారం ఇచ్చారు. కొమరవోలు, రోలుగుంట, కొవ్వూరు, భాగాపురం గ్రామాల్లో కోతలు జరిగాయి. తుపాను నేపథ్యంలో పంటను తరలించి రైతులు కుప్పలు వేసుకుంటున్నారు. కుప్పలు వేసుకున్న వరిపైరు తడవకుండా సంరక్షించుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు.తహసీల్దార్ ఎస్.నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరరావు కూడా రైతులకు సహాయక చర్యల కోసం అందుబాటులో ఉన్నారు.

ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ తగదు



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనకాపల్లి: రెసిడెన్షియల్ విధానంలో ప్రధానోపాధ్యాయులకు వేరే జిల్లాలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని తక్షణం రద్దు చేయాలని యూటీఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు డీఈవో కార్యాలయం వద్ద గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఈ జిల్లా ఉపాధ్యాయులకు పక్క జిల్లా అయిన విజయనగరంలో రెసిడెన్షియల్ పద్ధతిలో సంవత్సరం పొడవునా శిక్షణ ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి నెల బ్యాచ్‌ల వారీగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను వేరే జిల్లాలకు వెళ్లి రెసిడెన్షియల్ పద్ధతిలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఇస్తూ రాత్రి బస కూడా అదే జిల్లాలో ఉండాలని కోరుతూ ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మానసిక ఒత్తిడికి గురి చేస్తూ ఉపాధ్యాయుల ప్రాణాలు బలిగొంటున్న అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలంటూ ప్రభుత్వానికి అనేక సార్లు తెలియజేసినప్పటికీ మార్పు రాకపోవడం అన్యాయమన్నారు. నేడు మరొక ప్రధానోపాధ్యాయుడు విజయనగరం జిల్లా శిక్షలో ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధ్యాయులు ఇంటికి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. వయసులో పెద్దవారైన ఉపాధ్యాయులు రకరకాల అనారోగ్యాల వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఏడాది పాటు ట్రైనింగ్ ప్రోగ్రాముల వల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు, బోధనకు దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. శిక్షణను సెలవుల్లో లేదా ఆన్‌లైన్‌లో ఇవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రొంగల అక్కు నాయుడు, కార్యదర్శులు మాకిరెడ్డి రాజనాయుడు, వి. రమేష్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం. వెంకటప్పారావు, ఆడిట్ కమిటీ సభ్యులు షేక్ సలీం, సీనియర్ నాయకులు మామిడి బాబూరావు, దేవుడు నాయుడు, రవి, బాష, తేజ్‌వర్ధన్, ఆశ, నూతన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రొంగలి రాము

అనకాపల్లి: కూటమి నాయకులు తాము అధికారం చేపట్టిన వెంటనే ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేసేందుకు చర్యలు చేపడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ముఠా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగలి రాము అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ముఠా కార్మికులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రగతిలో ముఠా కార్మికులు అనేక సేవలు చేస్తున్నారని, వివిధ వ్యాపారాలలో ట్రాన్స్‌పోర్టు లోడింగ్, అన్‌లోడింగ్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని, టీడీపీ అధికారం చేపడితే ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను నేటికీ అమలు చేయలేదని, కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అటువంటి సమయంలో కార్మికులను ఎవరూ ఆదుకోరని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సమగ్ర చట్టం చేసి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు మంద రాము, సురేష్, బోడి రాజు, అప్పల నాయుడు, కనకాల అప్పల రాజు, కాపు శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థిని కొలతలు తీస్తున్న ఆరోగ్య కార్యదర్శి భవానీ

అనకాపల్లి: బాలల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి ఆధార్ నంబర్ మాదిరిగా ఒక ఐడీ ఇస్తారని, జీవిత కాలం అంతా అదే ఐడీ కొనసాగుతుందని జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్ఆర్‌పేట ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్ కసిరెడ్డి అప్పలకొండ అన్నారు. గురువారం స్కూల్ ఆవరణలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య ప్రగతి రికార్డ్ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఒక పుస్తకం ఇస్తామని, ఆ పుస్తకంలో విద్యార్థుల బరువు, ఎత్తు, తల, ఛాతీ, చేతుల కొలతలు తీస్తామని, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం గురించి తెలియజేస్తామన్నారు. ఆరు నెలలకు ఒకసారి విద్యార్థుల ఆరోగ్యం గురించి ప్రభుత్వం సర్వే చేస్తుందని చెప్పారు. రక్తం చేరేందుకు వారానికి ఒకసారి విద్యార్థికి పోలిక్ యాసిడ్ టాబ్లెట్ అందజేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ బొబ్బిలి భవానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విశ్వనాథ్

అనకాపల్లి: మండలంలో కొత్తూరు గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం ఫ్లోరోసిస్ వ్యాధిపై జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఎ.విశ్వనాథ్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన కానుకల పంపిణీపై అభ్యంతరం

అనకాపల్లి: రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ రైల్వే స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లో సభ్యులకు ఖరీదైన కానుకలు ఇవ్వడంపై బీహార్ ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు సుదామ ప్రసాద్ అభ్యంతరం తెలపినట్లు సమాజ్‌వాద్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కోన గురువయ్య యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులకు ఇచ్చిన కానుకల్లో ఒక గ్రాము బంగారం, వంద గ్రాముల వెండి ఉండడాన్ని సుదామ ప్రసాద్ గ్రహించి ప్రజాధనాన్ని దుబారా చేయడం దారుణమని, ప్రసాద్‌కు పంపిన గిఫ్ట్ ప్యాక్‌ను వెనక్కి పంపివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజా సేవ చేయడానికి వచ్చాం గనుక ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయరాదంటూ ఎంపీ రమేశ్‌కు సుదామ ప్రసాద్ లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ లేఖ రైల్వే శాఖలో ప్రకంపనలు సృష్టించిందన్నారు.

బాల్య వివాహాలు నేరం

నాతవరం : బాల్య వివాహాలు చేయడం చట్ట రిత్యా నేరమని గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి అన్నారు. మండలంలో ఎం.బి.పట్నం పంచాయతీలో గురువారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి హైస్కూల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అందువల్ల అవగాహన ర్యాలీలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన వయస్సు దాటాకే వివాహాలు చేయాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

దేవరాపల్లి : బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని దేవరాపల్లి మహిళా సంరక్షణ కార్యదర్శులు పి.ఎం సంధ్యారాణి, షేక్ మీరాబి అన్నారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో వచ్చే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. సీడ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ ఎల్.ఉషారాణి, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.